నమస్తే తెలంగాణ

# ఫలితాలు నేడే

- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- సర్వత్రా నెలకొన్న ఉత్కంఠ
- జిల్లాకేంద్రంలోని గురుకుల పాఠశాలలో లెక్కింపు
- కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్
- మహబూబాబాద్, డోర్నకల్‌కు వేర్వేరుగా గదుల కేటాయింపు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- ఉదయం 8గంటలకు లెక్కింపు ప్రారంభం



ఓట్ల లెక్కింపు జరగనున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఇదే..

మహబూబాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు గత నెల 30న ఎన్నికలు జరుగగా, నేడు కౌంటింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ పూర్తయిన తర్వాత అధికారులు ఈవీఎంలను మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు)లో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట బందోబస్త్‌ను ఏర్పాటు చేశారు. కాగా, నేడు ఓట్ల లెక్కింపు కోసం మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్ కోసం వేర్వేరుగా గదులను కేటాయించారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానున్నది. మహబూబాబాద్ నియోజకవర్గానికి మొత్తం 21 రౌండ్లు, డోర్నకల్ నియోజకవర్గానికి 19 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగనుంది. రెండు రోజులుగా ఓట్ల లెక్కింపు కోసం జిల్లా అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక్కో నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లు సమకూర్చారు. కౌంటింగ్ సిబ్బంది కూర్చునేందుకు వీలుగా గదిలోపల చైర్లు, టేబుళ్లు, ఫ్యాన్లు, లైట్లు తదితర సదుపాయాలు కల్పించారు. ఒక నియోజకవర్గంలో ఒక్కో పార్టీ నుంచి 14 మంది ఏజెంట్లు లోపలికి వెళ్లేందుకు అనుమతి ఇచ్చారు. వీరికి జిల్లా ఎన్నికల అధికారులు పాస్‌లు అందజేశారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు) ప్రధాన గేటు ఎదుట, లోపల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కోసం కౌంటింగ్ కేంద్రాల ముందు మీడియా సెంటర్‌ను పెట్టారు. మీడియా సెంటర్‌లో కుర్చీలు, రెండు ఎల్‌ఈడీ టీవీలతో పాటు కంప్యూటర్లను పెట్టారు. ఎన్నికల ఫలితాలు, రౌండ్ల వారీగా రిటర్నింగ్ అధికారులు మీడియా సెంటర్‌కు ఎప్పటికప్పుడు విడుదల చేయనున్నారు. గతనెల 30న నిర్వహించిన పోలింగ్‌లో డోర్నకల్ నియోజకవర్గంలో 87.71శాతం, మహబూబాబాద్ నియోజకవర్గంలో 82.34 శాతం ఓట్లు నమోదయ్యాయి. 2018 ఎన్నికలతో పోలిస్తే డోర్నకల్ –1.87శాతం, మహబూబాబాద్–2.39ఓట్ల శాతం తగ్గింది. తగ్గిన పోలింగ్ శాతం అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులు తమకే కలిసొస్తుందని ఎవరికివారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు 144 సెక్షన్‌ను అమలుతోపాటు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. పాస్‌లు లేకుండా ఎవరినీ లోపలకు అనుమతించొద్దని జిల్లా ఎన్నికల అధికారి శశాంక, ఎస్పీ సంగ్రామ్ సింగ్ అధికారులు, ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేశారు.

మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు గతనెల 30న పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు)లో భద్రపరిచారు. ఆదివారం నిర్వహించే కౌంటింగ్‌కు రెండు నియోజకవర్గాలకు వేర్వేరుగా గదులను ఏర్పాటు చేశారు. ఒక్కో గదిలో 14 టేబుళ్లు, కుర్చీలు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు తదితర ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ సమయంలో రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లు ఈవీఎంలను తాకకుండా చుట్టూ జాలీలను అమర్చారు. ఏజెంట్లకు ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్యాలరీలో వారు కూర్చునే విధంగా ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ సమయంలో బయటివా రు లోనికి రాకుండా ఉండేలా చుట్టూ జాలీలను అమర్చారు. ప్రతి కేంద్రంలో రిటర్నింగ్ అధికారితోపాటు సహాయ రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సిబ్బంది ఉంటారు. వీరు కౌంటింగ్ గదిలోకి ప్రవేశించగానే ప్రధాన ద్వారాన్ని మూసివేస్తారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన ఏజెంట్లు, మీడియాకు ప్రత్యేక గ్యాల రీ ఏర్పాటు చేశారు. ప్రతి ఈవీఎం వద్ద అన్ని పార్టీల ఏజెంట్లు ఉండేలా ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లకు అనుమతించరు. ప్రతి ఏజెంటును జాగ్రత్తగా తనిఖీ చేసి పంపించాలని జిల్లా ఎన్నికల అధికారి శశాంక, ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్ కేంద్రం ముందు భాగంలో మీడియాకేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడ రెండు ఎల్ఈడీ టీవీలతోపాటు కంప్యూటర్, ఇతర వస్తువులు అమర్చారు.

కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి శశాంకతోపాటు ఎస్పీ సంగ్రామ్ సింగ్ పరిశీలించారు. మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు వేర్వేరుగా ఏర్పాట్లు చేశారు. మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన కుర్చీలు, కంప్యూటర్లు, ఎల్ఈడీ టీవీలు సైతం పరిశీలించారు. మహబూబాబాద్, తొర్రూరు డీఎస్పీలు సత్యనారాయణ, వెంకటేశ్వరబాబుతోపాటు మహబూబాబాద్ టౌన్ సీఐ సతీశ్ భద్రత ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసులు మూడు అంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఎస్పీ పర్యవేక్షణలో ఒక అదనపు ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 30 మంది ఎస్సైలతోపాటు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లతో భద్రతను ఏర్పాటు చేశారు. కేంద్ర బలగాలు కూడా ఇక్కడ పహారా ఖాయనున్నాయి. ఓట్లలెక్కింపు ప్రారంభానికి ముందు నుంచి కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుంది. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.



కౌంటింగ్ కేంద్రంలో సిబ్బంది



కౌంటింగ్ కేంద్రంలో సిబ్బంది



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా



మనుమరాళ్లతో కలిసి ఆడుకుంటున్న మంత్రి సత్యవతి రాథోడ్

# సరదా సరదాగా..

## మనుమరాళ్లతో కలిసి ఉల్లాసంగా గడిపిన మంత్రి సత్యవతి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 2 : ఇన్ని రోజులు ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా గడిపిన మంత్రి సత్యవతిరాథోడ్ పోలింగ్ ముగియడంతో కాస్త రిలాక్స్ అయ్యారు. శనివారం మహబూబాబాద్ పట్టణంలో స్వయంగా ఆమె తన మనుమరాళ్ల కోసం షాపింగ్ చేసి ఆట వస్తువులను కొనుగోలు చేశారు. తన ఇంట్లో వారితో కలిసి ఉల్లాసంగా గడిపారు.




పండిన వరి పంట (వడ్లు)

## 'డబ్ల్యూజీఎల్ 962' రకం

# యాసంగికి అనుకూలం

కాశీబుగ్గ, డిసెంబర్ 2 : రాష్ట్రంలో వానకాలం, యాసంగిలో వరి సాగుకు డబ్ల్యూజీఎల్ 962 అనుకూలమైన సన్న గింజ రకమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఆర్ ఉమారెడ్డి తెలిపారు. యాసంగిలో కేవలం స్వల్పకాలిక రకాలను మాత్రమే సాగు చేసుకోవాలని సూచించారు. లేకుంటే గింజ కట్టే దశలో అధిక ఉష్ణోగ్రత వల్ల పగుళ్లు ఏర్పడి నూక అధికంగా వస్తుందని తెలిపారు. పైడిపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి 2021లో విడుదలైన వరంగల్ వరి–2(డబ్ల్యూజీఎల్ 962) యాసంగి సాగుకు అనుకూలమైన సన్నగింజ రకం అని పేర్కొన్నారు. ఇందులో నూక శాతం తక్కువగా ఉంటుందని తెలిపారు. డబ్ల్యుజీఎల్ 962 రకం మొక్కలు నిటారుగా మధ్యస్థ ఎత్తు కలిగి చేను కింద పడిపోకుండా ఉంటుందని తెలిపారు. అగ్గితెగులు, కాండం తొలుచు పురుగును కొంత వరకు తట్టుకుంటుందన్నారు. వండిన తర్వాత అన్నం రుచిగా పొడిపొడిగా ఉంటుందని, గింజ రాలే గుణం ఉండదని తెలిపారు. యాసంగిలో 130–135 రోజుల పంటకాలం కలిగి 6.5–7.5టన్నుల దిగుబడిని ఇచ్చే ఈ వరి విత్తనాలు వ్యవసాయ పరిశోధన స్థానంలో లభిస్తాయని డాక్టర్ ఉమారెడ్డి వివరించారు.

